క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ

నెల్లూరు (అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో గల పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, తదితరాలను విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. నగరానికి చెందిన పూజిత్ సాయి పదో జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్‌ను కట్ చేసి మానసిక దివ్యాంగులకు అందజేశారు. లక్ష్మీమానస, ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో పొగలు



నెల్లూరు(అర్బన్): కొద్ది క్షణాల్లోనే 108 వాహనంలో పొగలు దట్టంగా కమ్ముకున్న ఘటన నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో శనివారం చోటు చేసుకుంది. సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. బాలాయపల్లి మండలానికి చెందిన ఓ రోగిని 108 ద్వారా పెద్దాస్పత్రికి తరలించారు. రోగిని క్యాజువాల్టీలో చేర్చేందుకు డ్రైవర్, ఈఎంటీ వెళ్లారు. ఇంతలో వాహనం నుంచి పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి. విషయం తెలుసుకున్న సిబ్బంది అప్రమత్తమై ఫైర్ సేఫ్టీ మెజర్‌తో రక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ మాట్లాడారు. వర్షానికి బ్యాటరీకి ఉన్న వైర్లు ఎక్కడో షార్ట్ సర్క్యూటై పొగలు వచ్చాయన్నారు. సిబ్బంది తక్షణమే స్పందించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు.

లారీ బోల్తా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదుపు తప్పడంతో వ్యాన్ బోల్తాపడిన ఘటన వెంకటేశ్వరపురం సెంటర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. ప్లయ్‌ఉడ్‌తో విజయవాడ నుంచి నెల్లూరుకు ఐషర్ వ్యాన్ బయల్దేరింది. ఈ క్రమంలో వెంకటేశ్వరపురం సెంటర్‌కు వద్దకు వచ్చే సమయంలో ఎదురుగా వస్తున్న ఓ ఆటోను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. పెద్ద శబ్దంతో వ్యాన్ బోల్తా పడటంతో స్థానికులు ఆందోళనకు గురై రోడ్డుపైకి పరుగులు తీశారు.

భార్య, అత్తపై దాడి

నెల్లూరు(క్రైమ్): భార్య, అత్తపై దాడికి పాల్పడిన వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన ప్రతిభకు అల్లూరు మండలం పల్లెపాళేనికి చెందిన అవినాష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. బీవీనగర్‌లో ఏడు నెలలుగా ఉంటూ బేల్దారి పనులకెళ్తున్నారు. మద్యానికి బానిసైన ఆయన భార్యను నిత్యం కొడుతూ వేధించేవారు. భార్య తల్లిదండ్రులు ఇంటికి రావొద్దన్నా వస్తున్నారంటూ ఆమెపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన అత్త దేవకిపై సైతం దాడిచేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వర్మికంపోస్టును ఆదాయ వనరుగా మార్చుకోవాలి

కొడవలూరు: తడి చెత్త నుంచి ఉత్పత్తి అయ్యే వర్మికంపోస్టును పంచాయతీలకు ఆదాయ వనరుగా మార్చుకోవాలని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి సూచించారు. శనివారం ఆయన గౌతమ్‌నగర్‌లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మికంపోస్టు ఉత్పత్తిని పరిశీలించి ఎంత మోతాదులో ఉత్పత్తి చేస్తున్నారు? ఏ ధరలకు విక్రయిస్తున్నారు? తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి షేక్ షబ్బీర్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్మికంపోస్టు లాభదాయకమైనందున ఉత్పత్తిని కొనసాగించాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయుష్మాన్ భారత్ సర్వేపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. యూనిఫామ్‌తో విధులకు హాజరుకావడంతో పాటు సమయాన్ని పాటిస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వం సరఫరా చేసే కోడి గుడ్లు, పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. కోడిగుడ్లు, పౌష్టికాహారం సకాలంలో వినియోగించాలని, నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ షబ్బీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, తదితరులు ఉన్నారు.

ఉగాది మహోత్సవాన్ని వేడుకగా జరపాలి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఉగాది మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉగాది మహోత్సవ నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉగాది మహోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. నగరంలోని కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని సేవలను అందించాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు, కార్పొరేటర్ విజయలక్ష్మి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వైద్య శిబిరం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులకు ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో శనివారం నిర్వహించారు. క్రీడాకారులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. మెడికల్ ఆఫీసర్లు అలేఖ్య, కుసుమకిరణ్, తదితరులు వైద్యసేవలను అందించారు. కాగా యోగా పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని సెట్నెల్ సీఈఓ పుల్లయ్య తెలిపారు. చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల భవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనర్ల సమస్యలపై జిల్లా ట్రెజరీ కార్యాలయ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి లోకేష్‌బాబు అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్లు, తదితరులు హాజరుకావాలని కోరారు.

అధికారులపై దాడులు తగవు

నెల్లూరు (టౌన్): అధికారులపై దాడులు దురదృష్టకరమని రోడ్లు, భవనాల రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న పేర్కొన్నారు. కాకినాడలో ఏఎంవీఐ చిన్నారావుపై జరిగిన దాడి విషయమై ఆలిండియా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూమ్ కాన్ఫరెన్స్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపడతామని తెలిపారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, బాబు, కార్తీక్ పవన్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, ఏఓ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

రైతులను ఆదుకోవాలని వినతి

నెల్లూరు (వేదాయపాళెం): అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోటిరెడ్డి కోరారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష రైతు సంఘ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘ జిల్లా కన్వీనర్ షానవాజ్, కాంగ్రెస్ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్ర, రమణయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


పంట కోతల్లో అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో పంట కోతల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి నాగమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న తరుణంలో పంట కోతలను నిలిపేయాలని కోరారు. కోత కోసిన పంటలను జాగ్రత్త చేసుకోవాలని చెప్పారు.

ఆయుధ వినియోగంలో మెళకువలు అవసరం

నెల్లూరు(క్రైమ్): ఆమంచర్లలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ విజయారావు, పోలీస్ అధికారులు ఫైరింగ్ సాధన చేశారు. పోలీస్ వృత్తిలో ఫైరింగ్ నైపుణ్యం కీలకమని, అధునాతన ఆయుధ వినియోగంలో మెళకువలను నేర్చుకోవాలని సిబ్బందికి సూచించారు.

జీజీహెచ్ ఏడీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఏడుకొండలు బాధ్యతలను శనివారం స్వీకరించారు. విజయవాడలోని డైరెక్టరేట్‌లో ఏఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పెద్దాస్పత్రిలో రోగులకు మంచి సౌకర్యాలు కల్పించి.. పారిశుధ్య, ఇతర కాంట్రాక్ట్ సిబ్బందికి సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు.

ఉగాది వేడుకలు నేడు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బారకాసు): కనుపర్తిపాడు సమీపంలోని వీపీఆర్ కన్వెన్షన్లో ఉగాది వేడుకలను ఆదివారం సాయంత్రం నుంచి నిర్వహించనున్నామని ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ కమిటీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు సాయి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని వీపీఆర్ నివాసంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూచిపూడి నృత్యం, పంచాంగ పఠనం, తెలుగు భాషా వైభవంపై సాహిత్య రూపకం, సభా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఇందిరాదత్ హాజరుకానున్నారని చెప్పారు. కమిటీ అధ్యక్షుడు బలరామయ్య నాయుడు, సభ్యుడు హాజరత్‌బాబు, ఓఎస్డీ పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని స్వర్ణాల చెరువు, తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఈ సందర్భంగా నావల్ యూనిట్ ఎన్‌సీసీ అధికారి నరేంద్రబాబు మాట్లాడారు. నదులు, సముద్రాలు, చెరువులు, సరస్సు, కొలనులను పరిశుభ్రంగా ఉంచుకోవడమే పునీత్ సాగర్ అభియాన్ లక్ష్యమని చెప్పారు. పీఐ స్టాఫ్ సమోటా, రాకేష్‌కుమార్, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఉచిత యూరాలజీ సేవలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు (అర్బన్): నగరంలోని నారాయణ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో యూరాలజీ విభాగంలో ప్రోస్టేట్ గ్రంథి, కిడ్నీలో రాళ్లకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏప్రిల్ 19 వరకు నిర్వహించనున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. పోస్టర్లను ఆస్పత్రిలో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరుల సమావేశంలో యూరాలజిస్టులు శ్రీధర్, లక్ష్మీ రమేష్ మాట్లాడారు. దక్షిణాదిలో మొదటిసారిగా చిన్నపిల్లల యూరాలజీ విభాగాన్ని పూర్తిస్థాయిలో తమ ఆస్పత్రిలో ప్రారంభించామని చెప్పారు. రూ.రెండు వేలకుపైగా ఖర్చయ్యే హెల్త్ ప్యాకేజీని ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. కన్సల్టేషన్‌తో పాటు స్కానింగ్, ఎక్స్‌రే, సీరం క్రియాటినిన్, యూరో ఫ్లోమెట్రీ, హెచ్‌బీ, టీసీ, డీసీ, తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి సీటీ స్కాన్‌ను 50 శాతం రాయితీపై చేయనున్నామని పేర్కొన్నారు. అపాయింట్‌మెంట్, ఇతర వివరాల కోసం 96401 00555, 73311 70063 నంబర్లను సంప్రదించాలని సూచించారు. హాస్పిటల్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటదాస్

నెల్లూరు రూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటదాస్ పేర్కొన్నారు. ఆమంచర్లలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ విషయంలో లబ్ధిదారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తోందని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. హౌసింగ్ శాఖ ఈఈ నాగరాజు, డీఈలు శ్రీహరి, గోపాల్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, రూరల్ హౌసింగ్ ఏఈ శ్రీనివాస శౌరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ సంజయ్‌గాంధీనగర్, ఇందిరాగాంధీనగర్ ఫీడర్లలో నూతన టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంజయ్‌గాంధీనగర్, ఇందిరాగాంధీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్లను చేయనున్న నేపథ్యంలో ములుమూడి బస్టాండ్, గుప్తా పార్క్, పుత్తా ఎస్టేట్స్, వాకర్స్ రోడ్డు, శివగిరికాలనీ, మనుమసిద్ధినగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 ఏఈ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు.

'పవన్ కల్యాణ్‌వి ప్రగల్భాలు'

నెల్లూరు(బారకాసు): తాను అధికారంలోకి వస్తే బీసీలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తానంటూ ఇటీవల నిర్వహించిన సమావేశంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రగల్భాలు పలికారని సీమాంధ్ర బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలాకృష్ణయాదవ్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బీసీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ పోటీ చేస్తే ఆయన్ను ఓడించాలని జనసేన పార్టీ ఎందుకు కంకణం కట్టుకుందని ప్రశ్నించారు. 2024లో జనసేన అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన తరగతుల వారిని చైతన్యపర్చడమే తన లక్ష్యమని చెప్పారు. ఆయ్యప్పగుడి సమీపంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయం నుంచి గడప గడపకూ బీసీ గళం కార్యక్రమాన్ని ఈ నెల 26న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ యువజన విభాగం ద్వారా చేపట్టనున్నామని పేర్కొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణోత్సవం



ఏకాంతసేవ

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా శనివారం జరిపారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మాంగల్యధారణ, తదితరాలను అర్చకులు, వేదపండితులు శ్రీనివాసరావు, రమణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. తదుపరి స్వామివార్ల ఏకాంతసేవ వేడుకగా జరిగింది. త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శి శ్రీరామ్మూర్తి, నాగదేవీప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన త్యాగరాజ స్మరణోత్సవాలు

పురమందిరంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాలు ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన సంగీత విద్వాంసుడు రామ్మూర్తి గాత్రకచేరీని నిర్వహించారు. విజయగణేష్ (వయోలిన్), సుబ్రహ్మణ్యం (మృదంగం), గురురాజ్ (మోర్సింగ్) వాద్య సహకారం అందించారు. సరస్వతి భాగవతారిణితో సీతారామ కల్యాణ హరికథాగానం, లక్ష్మీకుమారి భాగవతారిణితో భక్త కుచేల హరికథా గానం వీనులవిందుగా సాగింది.

ఇండోర్ సబ్‌స్టేషన్లో పరిశీలన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెస్ట్ – 1 సెక్షన్ పరిధిలో గల సరస్వతీనగర్‌లో నిర్మిస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) సుబ్బరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో పలు ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇవి పూర్తయ్యాక విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లైన్‌లాస్ తగ్గి వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలను అందించేందుకు వీలవుతుందని చెప్పారు. నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్ రెడ్డి, కన్‌స్ట్రక్షన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్‌రెడ్డి, ఏడీఈలు శ్రీధర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న చిరంజీవి

నెల్లూరు(పొగతోట): పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ, డీపీఓ చిరంజీవి ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో డీఎల్పీఓలు, ఈఓపీఆర్డీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం పూర్తికానున్న నేపథ్యంలో ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌ను వంద శాతం వసూలు చేయాలని చెప్పారు. పంచాయతీల్లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వామిత్వకు సంబంధించి సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. డ్వామా పీడీ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్ రెడ్డిని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. తనకు రెండోసారి అవకాశం కల్పించినందుకు గానూ శ్రావణ్ కృతజ్ఞతలను తెలియజేశారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నగరాధ్యక్షుడిగా అశోక్



నెల్లూరు(వేదాయపాళెం): మాల మహానాడు నగరాధ్యక్షుడిగా అశోక్‌ను నియమించామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కిశోర్ తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత కేవీఆర్ పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు బైక్ ర్యాలీని కార్యకర్తలు నిర్వహించారు. అనంతరం భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడారు. జిల్లాలో మాల మహానాడు బలోపేతానికి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెనడీ, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, అరుణ కృపాకర్, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

భార్యపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): అనుమానంతో భార్యపై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడిపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురంలోని నాగసాయి మందిర ప్రాంతానికి చెందిన రత్నకు ముత్తుకూరు గేట్‌కు చెందిన హజరత్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. టైల్స్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న హజరత్ కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకొని ఆమెను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేయసాగారు. పలుమార్లు హత్యాయత్నం చేశారు. అతని వేధింపులను తాళలేక ఇటీవల ఆమె పుట్టింటికెళ్లారు. ఈ నేపథ్యంలో భార్య వద్దకు గురువారం ఆయన వెళ్లారు. ఆమె గొంతుకు చున్నీని బిగించి చంపేందుకు యత్నించగా, తప్పించుకొని పెద్దగా కేకలేశారు. కుటుంబ సభ్యులు, స్థానికులు రావడంతో అతను పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్యాయత్నం, వేధింపుల కేసును నమోదు చేశారు.

కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): నగదు కోసం వ్యక్తిని కత్తితో బెదిరించి.. అది లేకపోవడంతో సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన ఘటన వైఎంసీఏ గ్రౌండ్స్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్లోని ఓ భవన నిర్మాణం వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శివాజీ ఏసీ కూరగాయల మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలను కొనుగోలు చేసిన అనంతరం మూత్ర విసర్జనకు వైఎంసీఏ గ్రౌండ్స్ సమీపంలోకి వెళ్లారు. ఆయనకు తెలిసిన మహేంద్ర తనకు నగదు ఇవ్వాలని.. లేని పక్షంలో అంతు చూస్తానంటూ కత్తితో బెదిరించారు. దీంతో తన వద్ద నగదు లేదని.. సెల్‌ఫోన్ ఉందని చెప్పడంతో దాన్ని లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ ఎస్సై హనీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌కు నిప్పు

నెల్లూరు(క్రైమ్): బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించిన ఘటన మూలాపేటలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పెద్ద చెరుకూరుకు చెందిన ఖాజామొహిద్దీన్ కొంతకాలంగా మూలాపేటలో నివాసం ఉంటున్నారు. తన హీరో స్ప్లెండర్ బైక్‌ను ఇంటి ముందు శుక్రవారం రాత్రి నిలిపారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పంటించడంతో వాహనం దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.